















పార్కులో మొక్కను నాటుతూ..

వాహనంపై పార్కులో విహారం

ముద్దుగుమ్మల సందడి

ఎకో పార్కును సందర్శించిన వివిధ దేశాల సుందరీ మణులు

సుందరీమణుల నృత్యం

రంగారెడ్డి అర్బన్/శంకర్‌పల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా, శంకర్‌పల్లి మండలంలోని ఎక్స్‌పీరియం ఎకో పార్కు ముద్దుగుమ్మల రాకతో మరింత మనోహరంగా మారింది. అందాల భామల పర్యటనతో మెరిసిపోయింది. వివిధ దేశాల నుంచి వచ్చిన వనితలతో ఆ ప్రాంతం పులకరించిపోయింది. మిస్‌వరల్డ్ పోటీలను పురస్కరించుకుని నగరానికి వచ్చిన పోటీదారులు హెరిటేజ్ వాక్‌లో భాగంగా శుక్రవారం సాయంత్రం ఎకో పార్కును సందర్శించి సందడి చేశారు. పర్యాటక శాఖ అధికారులు శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో వీరందరినీ శంకర్‌పల్లి మండలం పొద్దుటూరులోని 'ఏకో టూరిజం' పార్కుకు తీసుకువచ్చారు. అక్కడ అందగత్తెలకు డోలు వాయిద్యాలతో సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. డోలు చప్పుళ్లకు అందగత్తెలు స్టెప్పులేశారు. పార్కులో సన్‌డైనర్ పాయింట్, బుద్ధ ఇన్‌సైడ్ ట్రీస్పాట్, రెడ్‌టైల్ ఫార్మేషన్ స్పాట్, గొడుగు ఆకారంలో ఉన్న ట్రీ స్పాట్, ఈజిప్షియన్‌రాక్ స్పాట్‌ను తిలకించి పులకించిపోయారు. ప్రతీ స్పాట్‌లో ఫొటోలకు ఫోజులిచ్చారు.

పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 22 నుంచి 28 వరకు జరగనున్న అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ పేర్కొన్నారు. శుక్రవారం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ.. పరీక్షలు రెండు సెషన్లలో జరగనున్న నేపథ్యంలో ఆర్టీసీ రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండేలా వైద్య శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ట్రాన్స్‌కో అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులోకి తేవాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహనకు అవసరమైన ఇన్విజిలేటర్లను నియమించాలన్నారు. మొదటి సంవత్సరం పరీక్ష ఉదయం 9 గంటలకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2.30 నుంచి ఉంటుందన్నారు. జిల్లాలోని 10 పోలీస్ స్టేషన్ల పరిధిలో 20 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరం జనరల్ విభాగంలో 5217 మంది, ఒకేషనల్ విభాగంలో 457 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ద్వితీయ సంవత్సరంలో జనరల్ విభాగంలో 2071 మంది, ఒకేషనల్ విభాగంలో 314 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా వైద్యాధికారి వెంకటరవణ, ఆర్టీసీ డిపో మేనేజర్ అరుణ, ఇంటర్ నోడల్ అధికారి శంకర్ నాయక్, ట్రాన్స్‌కో ఎస్ఈ రవిప్రసాద్ పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలు పరిష్కారం

» వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు, మే 16(ఆంధ్రజ్యోతి): భూ భారతితో రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. మండల పరిధిలోని నాగారం, రాజాపూర్, కొండాపూర్ కుర్దు గ్రామాల్లో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. నాగారంలో జరిగిన సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొని రైతులతో మాట్లాడారు. న్యాయస్థానాల్లో కేసులు ఉన్న భూములు తప్ప మిగిలిన భూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రైతులు తిరుగకుండా జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులే గ్రామాలకు వచ్చి భూ సమస్యలపై దరఖాస్తులు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్లు సాజిదా బేగం, శ్రీనివాస్, దీపక్, శ్యాంసన్, డీటీ విజయేందర్ పాల్గొన్నారు.

ధాన్యం.. దైన్యం



కొనుగోలు కేంద్రాల్లో వసతులు కరువు

రైతులకు అందని గన్నీ బ్యాగులు

లారీలు రాక కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు

తప్పక దళారులకు అమ్ముకుంటున్న రైతులు

నిబంధనల పేరిట కొనుగోళ్లలో జాప్యం

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఊపందుకోవడం లేదు. యాసంగికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 128 కేంద్రాలు ఏర్పాటు చేసినా నిబంధనల పేరిట కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే రైతులు సగానికి పైగా ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించారు. మొత్తం 10.50 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటివరకు 25 శాతం అంటే 2.50 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని మాత్రమే సేకరించారు. గతేడాదితో పోల్చితే ఈ సంవత్సరం ఇంకా 75 శాతం ధాన్యాన్ని సేకరించాల్సి ఉంది. ఇప్పటివరకు సేకరించిన ధాన్యానికి సంబంధించి రూ.26 కోట్లకు పైగా డబ్బులు రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఆకాశంలో మబ్బులు అన్నదాతలకు గుబులు పుట్టిస్తున్నాయి. తరుచూ వస్తున్న వర్షాలతో ధాన్యాన్ని కాపాడుకోలేక కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. కేంద్రాల్లో సరైన వసతులు లేక, గన్నీ బ్యాగులు సరిగా అందక.. లారీలు రాకపోవడంతో ఎక్కడ వడ్ల రాశులు అక్కడే దర్శనమిస్తున్నాయి.

- పరిగి, మే 16(ఆంధ్రజ్యోతి)

జిల్లా వివరాలు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు	128
సేకరణ లక్ష్యం	10.50 లక్షల క్వింటాళ్లు
ఇప్పటివరకు సేకరించింది	2.50లక్షల క్వింటాళ్లు
కావాల్సిన గన్నీ బ్యాగులు	29 లక్షలు
అందుబాటులో ఉన్నవి	15 లక్షలు



చౌడాపూర్ మండలం మరికల్ కేంద్రంలో ధాన్యం బస్తాలు

ధాన్యం కొనుగోళ్లలో కొర్రీల కారణంగా సేకరణ ఆలస్యమవుతోంది. వడ్లను ఆరబెట్టి కేంద్రాలకు తీసుకొచ్చినా నిర్వాహకులు తాలు, తేమ పేరిట నిరాకరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ధాన్యంలో తేమ 17 శాతానికి మించి ఉండకూడదు. చెత్త ఒకశాతం కన్నా ఎక్కువగా ఉండొద్దు. మట్టి పెళ్లలు, రాళ్లు ఒకశాతం కన్నా మించరాదు. పాడైన రంగుమారిన, మొలకెత్తిన, పురుగు తిన్న ధాన్యం ఐదు శాతంలోపే ఉండాలి. పూర్తిగా తయారు కానీ, ముడుచుకుపోయిన ధాన్యం మూడు శాతానికి మించరాదు. ఈ నిబంధనల పేరుతో రైతులు ధాన్యాన్ని తీసుకువస్తే ఏదో కారణం చేత కొనుగోలుకు నిరాకరిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఇక తప్పని పరిస్థితుల్లో ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తున్నారు. అక్కడ ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరకన్నా రూ.200 తక్కువతో కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అన్ని రకాలుగా జాగ్రత్తలు పడి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. మిల్లర్లు ధాన్యం బాగాలేదని చెప్పి అందులో తరుగు తీస్తున్నారు. 40 కిలోల బస్తాకు

మిగతా 8వ పేజీలో...



పరిగి మిట్టకోడూరు కేంద్రంలో తడిసిన ధాన్యం

తూకాలు వేయడం లేదు



నేను పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లా. అక్కడ కొనేందుకు కొర్రీలు పెడుతున్నారు. తూకాలు వేయడం లేదు. అధికారుల నిర్లక్ష్యం వల్ల కేంద్రంలోనే ధాన్యం బస్తాలు పెట్టి అక్కడే నిద్రిస్తున్నాం. వర్షానికి కొంత ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాం కొనమని చెబుతున్నారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు.

- కాకి కృష్ణ, రైతు, మిట్టకోడూరు, పరిగి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతం

సాంకేతిక బోధనతో ఉత్తమ ఫలితాలు

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి/మల్లాపూర్, మే16(ఆంధ్రజ్యోతి): సాంకేతిక బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ గౌతమ్ అన్నారు. నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులకు జరుగనున్న శిక్షణా తరగతులకు శుక్రవారం ఆయన హాజరై మాట్లాడారు. జీపీటీ యాప్‌తో బోధన మెరుగు పడుతుందన్నారు. అలాగే అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ల్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని సూచించారు.



» ఇప్పటికే 229 ఎకరాల భూ సేకరణ పూర్తి

» లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

» హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా ప్రజలు



మాదారంలో ప్రారంభమైన పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు పనులు

మాదారం.. ఇక పారిశ్రామిక కేంద్రం

పనులు షురూ చేసిన ప్రభుత్వం

మేడ్చల్ ప్రతినిధి, మే 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు కూతవేటు దూరంలో ఉన్న మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా పారిశ్రామిక కేంద్రంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఐటీ విస్తరణపై దృష్టి సారించిన ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. నగరానికి తూర్పు వైపు ఉన్న ఘట్‌కేసర్ మండలం మాదారంలో పారిశ్రామిక కేంద్రం(ఇండస్ట్రియల్ పార్కు) ఏర్పాటుకు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. దీనికోసం ఇప్పటికే రైతుల నుంచి 229 ఎకరాలను జిల్లా రెవెన్యూ యంత్రాంగం సేకరించి టీఎస్ఐఐసీకి అప్పగించింది. మాదారంలో పారిశ్రామిక కేంద్రం ఏర్పాటుకు

మిగతా 8వ పేజీలో...

అందుబాటులో ప్రభుత్వ భూములు

నగర శివారులోని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో నూతన పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ భూములున్నాయి. 66.8 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 65 కిలో మీటర్ల రాష్ట్ర రహదారులు ఉన్నాయి. వీటికి తోడు ఔటర్ రింగ్ రోడ్డు ఉండటంతో కొత్త పరిశ్రమల స్థాపనకు మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా అనువైన ప్రాంతంగా పారిశ్రామికవేత్తలు భావిస్తున్నారు. అన్ని రకాల రహదారుల సమీపంలో దాదాపు 10 వేల ఎకరాల భూములు ఉండగా, ఇందులో ప్రయివేటు భూములు కూడా ఉన్నాయి. నగరశివారులోని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 6,084.72 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నట్లు రెవెన్యూ శాఖ రికార్డులు తెలుపుతున్నాయి. మాదారంలో పారిశ్రామిక కేంద్రంతో పాటు కండ్లకోయలో ఐటీ పార్కు పూర్తయితే జిల్లా స్వరూపమే మారిపోనున్నది.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

కోట్‌పల్లి, మే 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రతి తల్లిదండ్రులు ప్రభుత్వ బడులలోనే విద్యార్థులను చేర్పించాలని జిల్లావిద్యాధికారిని రేణుకాదేవి అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. సర్కారు బడుల్లో పిల్లల సంఖ్యను గణనీయంగా పెంచాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కరీంపూర్ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని ఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్రీనివాస్‌కు సూచించారు. ఎంఈవో చంద్రప్ప, కేజీబీవీ ప్రత్యేకాధికారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పల్లవి, ఉపాధ్యాయులు మైనోదిన్, బుచ్చిరెడ్డి వేణుగోపాల్, ఉమాదేవి, శేఖర్, లక్ష్మణ్, యాస్మిన్, ఫాతిమా బేగం, పరమేశ్వరి ఉన్నారు.



మాట్లాడుతున్న రేణుకాదేవి

హైబీపీ.. అశ్రద్ధ వద్దు!



భయపెడుతున్న అధిక రక్తపోటు

పట్టణాలు, పల్లెవాసుల్లో బాధితులు

ముప్పై ఏళ్లు నిండిన వారిలో హైబీపీ

గుండె, కిడ్నీ తదితర ప్రాబ్లమ్స్ వచ్చే ప్రమాదం

అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ఆధునిక యుగంలో ఉరుకుల పరుగుల జీవనం సర్వసాధారణమైపోయింది. వృత్తిరీత్యా ఒత్తిడికి గురికావడం, ఆహార అలవాట్లలో మార్పులు చోటుచేసుకోవడం వల్ల ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ప్రధానంగా ప్రస్తుతం బీపీ సమస్య అనేక మందిని భయపెడుతోంది. పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా రక్తపోటుకు గురవుతున్నారు. హైబీపీ వల్ల గుండెలయ దెబ్బతినడం, కిడ్నీ సమస్యలు ఎదురై ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నాయి. మానసిక ఒత్తిడి కారణంగా 30 ఏళ్లు నిండిన వారిలో ఎక్కువమంది బీపీ సమస్యను ఎదుర్కొంటున్నారు. అశ్రద్ధ చేయకుండా వ్యాయామం, యోగా తదితర ప్రక్రియలతో బీపీని అదుపుచేసుకోకపోతే మొదటికే ముప్పు వస్తుందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. శనివారం 'ప్రపంచ హైపర్ టెన్షన్ డే' సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

7

తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకురావాలి

మేడ్చల్‌టౌన్, మే16 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రానికి తాలు లేకుండా బాగా ఎండబెట్టి ధాన్యాన్ని తీసుకురావాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ సూచించారు. మేడ్చల్ రైతు సహకార సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు చేపట్టిన నిరసనపై ఆమె స్పందించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ సుగుణ బాయితో కలిసి శుక్రవారం సహకార సంఘాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఏడీఏ వెంకట రామ్ రెడ్డి, ఏవో అర్చన, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపనుల్లో నిర్లక్ష్యం

● కంకర, మట్టి వేసి వదిలేసిన కాంట్రాక్టర్ ● వాహనదారుల అవస్థలు


దుమ్మును చూసి నిలిచిపోయిన ద్విచక్రవాహనదారులు

పెద్దేముల్, మే 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాండూరు-వికారబాద్ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.49.78కోట్లు మంజూరు చేసింది. ఈ పనులను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి గత ఫిబ్రవరి 23న పనులు ప్రారంభించారు. ఆరోజు నుంచి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మన్‌సాన్‌పల్లి నుంచి మంబాపూర్ సమీపం వరకు రోడ్డును అక్కడక్కడ మధ్యలో తవ్వి కంకరమట్టి వేసి వదిలేశాడు. పనులు ప్రారంభించి మూడునెలలు కావస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. ఇది తాండూరు-హైదరాబాద్ ప్రధానరోడ్డు కావడంతో వాహనాల రాకపోకలు వందల సంఖ్యలో వెలుతుంటాయి. వాహనాల రాకపోకల కారణంగా పెద్దఎత్తున దుమ్ములేస్తోంది. దీంతో వాహనదారులకు అవస్థలు తప్పడంలేదు. కాంట్రాక్టర్ రోజుకు రెండు మూడు సార్లు ట్యాంకర్లతో నీళ్లు పడితే దుమ్ము లేవకుండా నివారించవచ్చు. అలాంటి పనులు చేపట్టకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు. దుమ్మువల్ల ఎదురుగా వస్తున్న వాహనాలు కూడా కనిపించడం లేదు. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొద్ది రోజుల కిందట దుగ్గాపూర్ గ్రామానికి చెందిన ఒక మహిళ రోడ్డును తవ్విన ప్రాంతంలో బైక్‌పై నుంచి పడి చేయి విరిగింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


మంబాపూర్ సమీపంలో లేస్తున్న దుమ్ము

ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తాం


మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పాలకవర్గం

షాద్‌నగర్ అర్బన్, మే 16(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలక వర్గం తెలిపింది. మార్కెట్ యార్డులో శుక్రవారం పర్యటించిన పాలకవర్గం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి పైరును యంత్రాలతో కోసి, ధాన్యం తూర్పార పట్టకుండా, ఎండబెట్టకుండా యథావిధిగా తీసుకువస్తే ఎలా అని రైతులను ప్రశ్నించారు. వర్షాలు కురుస్తున్నాయని, గ్రామాల్లో కూలీల సమస్య అధికంగా ఉన్నందున.. చేనులో నుంచే ధాన్యాన్ని మార్కెట్‌కు తెచ్చి విక్రయిస్తున్నామని రైతులు సమాధానమిచ్చారు. ధాన్యం పచ్చిగా ఉందని, తూర్పార పట్టలేదని, క్వింటాలుకు రూ.1,800 నుంచి రూ.1,900 వరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ధాన్యాన్ని 17శాతం లోపు తేమ ఉండేటట్టు ఆరబెట్టి, తూర్పార పట్టి తీసుకువస్తే రూ.2,320ల మద్దతు ధర, రూ.500 బోనస్ వస్తుందని పాలకవర్గ సభ్యులు వివరించారు. రైతులు పచ్చి ధాన్యం తెచ్చి నష్టపోవద్దని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ మాట్లాడారు. ధాన్యానికి మద్దతు ధరను కల్పించాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయించారని గుర్తుచేశారు. షాద్‌నగర్ నియోజక వర్గంలోని షాద్‌నగర్, కొత్తపేట, ఎదిర, జాకారం, చౌదరిగూడ, పెద్ద ఎల్కిచర్ల, ముట్పూర్ గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, నేటి వరకు 24,630 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం విక్రయించిన రైతులకు డబ్బులు కూడ వస్తున్నాయన్నారు. షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సైతం ప్రతీరోజు టెండర్లు వేసేలా చర్యలు తీసుకుంటామని, రైతులను ఇబ్బంది పెట్టే వ్యాపారులను ఉపేక్షించబోమని బాబర్‌ఖాన్ హెచ్చరించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, మల్లేష్, వెంకట్‌రెడ్డి, సురేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


పెద్దఎల్కిచర్లలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది, పోలీసులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

● కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది చర్యలు

చౌదరిగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్దఎల్కిచర్ల గ్రామంలో గల ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపడుతున్నట్లు గ్రామస్థులు స్థానిక తహసీల్దార్‌తో పాటు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ సిబ్బంది సంఘటనా స్థలాన్ని సందర్శించి చర్యలు చేపట్టారు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి సర్వేనంబర్ 130లోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టినట్లు గుర్తించి వెంటనే జేసీబీ సాయంతో రాళ్లతో నిర్మించిన కట్టడాలను తొలగించారు. ఆర్ఐ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశానుసారం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామస్థులు ఎక్కడైనా అక్రమ నిర్మాణాలు జరిపితే మా దృష్టికి తీసుకురావాలని సూచించారు. అదే విధంగా పంచాయతీ కార్యదర్శి వారం రోజులుగా నిర్మాణం జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదంటూ ఫోన్ చేసి అడిగారు. గ్రామంలో అక్రమ నిర్మాణాలు చేపడితే వెంటనే గ్రామ పంచాయతీ యాక్టు ద్వారా చర్యలు తీసుకోవడంతో పాటు రెవెన్యూ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాగా, అక్రమ నిర్మాణం కూల్చడంతో గ్రామస్థులు కలెక్టర్‌తో పాటు రెవెన్యూ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

సబితారెడ్డిని విమర్శించే అర్హత కాంగ్రెస్‌కు లేదు

మహేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజల కోసం పాటుపడే మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే.. అభివృద్ధి ప్రదాత సబితాఇంద్రారెడ్డిని విమర్శించే కనీస అర్హత కూడా కాంగ్రెస్ నాయకులకు లేదని, మహేశ్వరం నియోజకవర్గంలో సబితారెడ్డి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, ఉపాధ్యక్షుడు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డిలు కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. శుక్రవారం మహేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంతో పాటు ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ నాటి నుంచి సుదీర్ఘంగా కీలక మంత్రి పదవులు చేపట్టి ఉత్తమ మహిళా మంత్రిగా, నాయకురాలిగా ప్రజల మన్ననలు పొందుతున్న సబితారెడ్డిని విమర్శించే స్థాయి దేప భాస్కర్‌రెడ్డితో పాటు ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడికీ లేదన్నారు. సబితారెడ్డి చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ సిద్ధమా అని ప్రశ్నించారు. ప్రజలను పాలించే సత్తాలేని కాంగ్రెస్ ముఖ్యమంత్రితో పాటు మంత్రి వర్గం మూకుమ్మడి రాజీనామాలు చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కొందరు కాంగ్రెస్ నాయకులు వారు మాట్లాడే భాషను మార్చుకోవాలన్నారు. అధికార పార్టీలో ఉండి కేవలం ఫ్లెక్సీలు వేయించుకోలేని కాంగ్రెస్ నాయకులు అధికారిక కార్యక్రమంలో సబితారెడ్డిని విమర్శిస్తారా? అని మండిపడ్డారు. పాలన చేత కాక అభివృద్ధి పనులకు పైసలు లేవని చెప్పిన ముఖ్యమంత్రి చరిత్రలో రేవంత్‌రెడ్డి ఒక్కడేనన్నారు. మహేశ్వరం పీఏసీఎస్ చైర్మన్ పాండుయాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, కర్రోళ్ల చంద్రయ్య, ఆనందం, నవీన్, ఆదిల్‌అలీ, కె.ప్రభాకర్, డి.కృష్ణ, కె.మహేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్‌శర్మ

స్వయం ఉపాధితో ఆర్థికవృద్ధి


మహిళలకు సర్టిఫికెట్లు అందజేసిన అంజలీదేవి

యాచారం, మే 16(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధితో ఆర్థిక ఇబ్బందులు తీర్చుకుంటే పేదరికం నుంచి విముక్తి పొందడం చాలా సులువని రంగారెడ్డి జిల్లా జనశిక్షణ సంస్థాన్ కో-ఆర్డినేటర్ అంజలీదేవి అన్నారు. మండలంలోని మాల్ గ్రామానికి చెందిన వంద మంది మహిళలు కుట్టు (టైలరింగ్)శిక్షణ పొందారు. వారికి శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆమె సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అంజలీదేవి మాట్లాడుతూ మహిళలు మహిళల దుస్తులతో పాటు చిన్నపిల్లల దుస్తులు కుట్టడం, ఎంబ్రాయిడరీ నేర్చుకోవడంతో ఆర్థిక ఇబ్బందులు తీర్చుకోవచ్చన్నారు. తమ సంస్థ పేదలను ఆదుకునేందుకు గాను ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని చెప్పారు. త్వరలో మరి కొంత మందికి శిక్షణ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నోళ్ల పద్మజ, కాంగ్రెస్ నాయకుడు భట్టు శ్రీనివాస్ తదితరులున్నారు.

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, మే 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పారదర్శకంగా చేపడుతున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి దశాబ్దాల సొంతింటి కలను సాకారం చేస్తుందన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులతో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, ప్రభుత్వ పథకాల అమలు, మున్సిపాలిటీ అభివృద్ధి తదితర విషయాల గురించి చర్చించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపిక, మంజూరులో కమిటీ సభ్యులు, అధికారులు పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. కల్వకుర్తినియోజకవర్గానికి మొదటి విడత 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మరో వెయ్యి ఇళ్లు అదనంగా ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేశవులు, నాయకులు కృష్ణనాయక్, మానయ్య, ఖాదర్ ఖాద్రీ, మైసయ్య, బాబా, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

వైభవంగా వీరనాగమ్మ కల్యాణోత్సవం


వీరనాగమ్మ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

కేశంపేట, మే 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీరనాగమ్మ కల్యాణోత్సవం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం దేవతామూర్తికి గంగస్నానం చేయించి, ప్రత్యేకంగా అలంకరించి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విగ్రహమూర్తిని ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేకంగా అలకంరించిన మండపంలో ఉంచారు. ఒగ్గు కళాకారులచే వీరనాగమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆరెకటికలతో పాటు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, శివాజీ, నాగేశ్వర్, శ్రీనివాస్, మహేందర్, సత్యనారాయణ, లక్ష్మణ్, నరేష్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి



మేడిపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, మే 16(ఆంధ్రజ్యోతి): యూనిఫాం వేసుకున్న తమతో పాటు యూనిఫాం లేని మీరు కూడా పోలీస్ అని గమనించి మసలు కోవాలని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీ ఒక్కరు సహకారమందించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లిక్కి కృష్ణంరాజు అన్నారు. శుక్రవారం సాయంత్రం మేడిపల్లి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి అమూల్యమైన జీవితాన్ని పాడు చేసుకోరాదని కోరారు. గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండడంతో పాటు క్రయ విక్రయాలపై పోలీసులకు సమాచారమందించాలని చెప్పారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, మాజీ సర్పంచ్ బోడ కృష్ణ, కలకొండ బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడు

-పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరికీ ఆదర్శప్రాయుడని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని కెరవెళ్లి గ్రామంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్ భారతీయ న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నాయకుడిగా, సంఘ సంస్కర్తగా ఎన్నో సేవలందించారన్నారు. అంటరానితనం, కుల వివక్షను వ్యతిరేకించి సమాజంలో మార్పునకు కృషి చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను అంబేడ్కర్ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు.


అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

ఘనంగా కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ జాతర

తాండూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): భక్తుల కొంగు బంగారం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు పూజాకార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మొదటి శుక్రవారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారికి వేపచీర ధరించి ప్రత్యేక అలంకరణ చేశారు. జ్యోతిని మోస్తూ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్రతోపాటు తాండూరు చుట్టుపక్కల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. జాతరలో ఆలయ కమిటీ చైర్మన్ నవీన్ రెడ్డి, ఈవో శేఖర్‌గౌడ్ అక్కడి ఉండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. శ్రీనివాస్ పూజారి ఆలయ ప్రతినిధి రవి తదితరులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.


అమ్మవారి దర్శనానికి క్యూలో భక్తులు

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి


సబ్‌కలెక్టర్‌కు సమస్యలను విన్నవిస్తున్న రైతులు

బషీరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని కాశీంపూర్, మైల్వార్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ అక్కడి రైతులతో సమస్యలపై ఆరా తీశారు. హమాలీల సమస్యతో తూకాలు సక్రమంగా జరగక రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని, రైతులు పలువురు సబ్‌కలెక్టర్ ఎదుట వాపోయారు. ధాన్యం కొనుగోలు జాప్యంతో కిలోమీటరు పొడవున కుప్పలుగా పెట్టి అవస్థలు పడుతున్నామని మొరపెట్టుకున్నారు. అకాలవర్షాలతో ధాన్యం తడిసిపోయి మొలకెత్తుతోందని రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. ఈ విషయమై అక్కడి నిర్వాహకుడు నరేష్‌ను సబ్‌కలెక్టర్ అడిగారు. హమాలీల సమస్య ఉందని, కొనుగోలు చేస్తున్నామని నిర్వాహకుడు తెలిపాడు. అదేవిధంగా తూకలు సక్రమంగా లేక, గన్నీ బస్తాలు సరిపోను లేక ధాన్యం కుప్పలుగా పెడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యాన్ని మిల్లులకు పంపితే తరుగు పేరిట కోతలు పెడుతున్నారని సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మిల్లులకు తాను స్వయంగా వెళ్లి పరిశీలిస్తానని రైతులు ఆందోళన చెందవద్దని సబ్‌కలెక్టర్ సూచించారు. ఆయన వెంట బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు సోంపల్లి బిచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.


చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

సీఎంఆర్‌ఎఫ్.. పేదలకు వరం

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం, మే 16 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన 40మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ చాలా మంది నిరుపేద కుటుంబాలు అనారోగ్యంతో అప్పుల పాలవుతున్నారని.. అలాంటి వారికి సీఎం సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశించినమేర లేకున్నా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం తలపెట్టిన ఏ ఒక్క సంక్షేమ పథకానికీ ఆటకం కలగకుండా ముందుకు నడిపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును చూసి ఓర్వ లేని బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయన్నారు. ఎవరు ఎన్ని ఆరోపనలు చేసినా ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు పరుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, రాజరాజేశ్వరాలయం కమిటీ చైర్మన్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ యాదయ్య, భిక్షపతి, పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.


నేదునూరులో ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

నిరుపేదల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

కందుకూరు, మే 16(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మాజీ వైస్ ఎంపీపీ గంగుల శమంత ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కె.రాజాప్రతాప్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్‌లు అన్నారు. శుక్రవారం మండలంలోని నేదునూరు, లేమూరు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి వారు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను దశలవారిగా అమలు చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ ఆర్.బిక్కునాయక్, ఏఈ సీహెచ్ వెంకటేశ్వర్లు, నాయకులు డిల్లీ శ్రీధర్, ఎం.ఇంద్రారెడ్డి, ఎం.భాస్కర్, జి.దేవేందర్. ఎండీ రహీమ్, జి.పద్మరాణి, జి.మధుసుధన్‌రెడ్డి, బాలయ్య, రాకేష్‌గౌడ్, సాధ పాండురంగారెడ్డి, బి.సురేష్, పి.యాదిరెడ్డి, బి.శ్రీనివాస్, జి.సురేందర్‌రెడ్డి, జి.సంజీవరెడ్డి, నాగరాజు, పుష్పదర్శన్, పంచాయతీ కార్యదర్శి రాకేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో శాస్త్రవేత్తలు

సుస్థిర సాగుతోనే నేల ఆరోగ్యం

కోట్‌పల్లి, మే 16 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయ సాగుతోనే నేల ఆరోగ్యంగా ఉంటుందని తాండూరు వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త యమునారెడ్డి అన్నారు. మండలంలోని బుగ్గపురం రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలుఅనే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. నూతనసాగు మెలకువలు వివరించారు. వానకాలం సాగు సమయంలో తాండూర్ వ్యవసాయ పరిశోధన సంస్థలో కంది విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రైతులు అడిగిన పలు సబ్సిడీ పరికరాలను నోట్ చేసుకున్నట్లు తెలిపారు. పంట విత్తనాలు కొనుగోలు సమయంలో రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. భూసార ఆధారిత ఎరువుల యాజమాన్యం చేపట్టి సాగు ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, శాస్త్రవేత్త సుజాత, వ్యవసాయ విస్తరణ అధికారులు సందీప్, నర్మద, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునందన్‌రెడ్డి

ఉద్యోగులకు ఐదు డీఏలు ప్రకటించాలి

పరిగి, 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రావాల్సిన ఐదు డీఏలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునందన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పరిగిలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ కమిటీ వేసి రెండేళ్ల కాల పరిమితి పూర్తయిందని, నివేదిక తెప్పించి 51శాతం ఫిట్‌మెంట్‌తోట అమలు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకుగానీ, దేశంలోని 28రాష్ట్రాల ఉద్యోగులకుగానీ ఒక్క డీఏ పెండింగ్‌లో లేదని, తెలంగాణ ఉద్యోగులకు మాత్రమే 30నెలలకు సంబంధించి ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ గోపాల్, జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షుడు బసవరాజు, నాయకులు జాంప్లా, రూప్‌సింగ్, బాలకృష్ణ, ప్రవీన్, నరేందర్, మొగులయ్య పాల్గొన్నారు.

తిరంగ యాత్రను విజయవంతం చేద్దాం

చేవెళ్ల, మే 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 17న ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించే తిరంగయాత్రను విజయవంతం చేద్దామని బీజేపీ చేవెళ్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎ.అనంతరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతం నేపథ్యంలో పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఊచకోత కోసిన భారత సైన్యానికి దేశమంతా ఏకమై అభినందనలు, ప్రశంసలు తెలుపుతోందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని త్రివిధ దళాలు అందించిన సేవలకు కృతజ్ఞతగా మనమంతా ఐక్యత చాటడానికి పార్టీలకతీతంగా ట్యాంక్‌బండ్ వద్ద నిర్వహించే తిరంగ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మృత్యుంజయుడు.. ఆ కార్మికుడు!

రైలు కింద నుంచి ట్రాక్ దాటేందుకు యత్నం

- అకస్మాత్తుగా కదిలిన రైలు
- వెంటనే పట్టాల మధ్య పడుకొని ప్రాణాలను కాపాడుకున్న వైనం

కొత్తూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): భూమ్మీద నూకలున్నాయంటే ఇదేనేమో. ఓ కార్మికుడు అగిఉన్న రైలు కింద నుంచి ట్రాక్ దాటేందుకు ప్రయత్నించాడు. అంతలోనే రైలు ఆకస్మాత్తుగా కదిలింది. సమయోచితంగా ఆలోచించిన అతను వెంటనే రెండు పట్టాల మధ్య కదలకుండా నిలువునా పడుకున్నాడు. రైలు వెళ్లిపోయే వరకు అలాగే ఉండి తర్వాత లేచి బతుకు జీవుడా బట్టలు దులుపుకుంటూ ఇంటికి వెళ్లిపోయాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ వద్ద చోటుచేసుకుంది. మిగతా వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన అవినాష్(30) తిమ్మాపూర్ సమీపంలో ఓ పరిశ్రమలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. అతను స్టేషన్ తిమ్మాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. గురువారం సాయంత్రం అవినాష్ విధులు ముగించుకుని ఇంటి వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. స్టేషన్ వెనుక భాగాన తన ఇల్లు ఉండడంతో అగిఉన్న గూడ్సు రైలు కింద నుంచి ట్రాక్ దాటేందుకు ప్రయత్నిస్తూ మధ్య వరకు వచ్చాడు. ఆకస్మాత్తుగా రైలు కదలడం గమనించిన అవినాష్ పట్టాల మధ్య నిలువునా పడుకుని ఉండిపోయాడు. రైలు బోగీలు పూర్తిగా వెళ్లిపోయిన తర్వాత లేచి బయటకు వచ్చాడు. అవినాష్‌కు ఎలాంటా గాయాలు కాకపోవడంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. దేవుడే తనను కాపాడడంటూ స్థానికుల వద్ద అవినాష్ కంటతడి పెట్టాడు. ప్రాణాపాయంతో గట్టెక్కిన కార్మికుడిని మృత్యుంజయుడంటూ అభినందించారు. ఈ సంఘటనను స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా వైరల్‌గా మారింది.


నడుస్తున్న రైలు కింద బిక్కు బిక్కుమంటూ పడుకున్న కార్మికుడు

రైల్వే లైన్‌పై దాటేందుకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే లైన్‌పై పూర్తి స్థాయిలో ఓవర్ పుట్ బ్రిడ్జిని పెంచాలని స్థానికులు కోరారు.

హైబీపీ.. అశ్రద్ధ వద్దు!

భయపెడుతున్న అధిక రక్తపోటు

జిల్లాలో నమోదైన బీపీ కేసుల వివరాలు

రక్తపోటు పరీక్షలు	4,81,987
నిర్ధారణ	1,02,968
నియంత్రణలో	54,123

2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు..

నేడు ప్రపంచ రక్తపోటు దినోత్సవం



రంగారెడ్డి అర్బన్, మే 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రక్తపోటుకు గురవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుంది. తినే ఆహారం, జీవన విధానంలో మార్పులు, మానసిక ఒత్తిడి, ఉద్యోగంలో ఒత్తిడి ఇలా రకరకాల కారణాల వల్ల మనుషుల బీపీ పెరిగిపోతోంది. జిల్లాలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు 4,81,987 మందికి బీపీ పరిశీలిస్తే వారిలో 1,02,968 మందికి రక్తపోటు ఉన్నట్లు నిర్ధారించారు. 54,123 మందికి రక్తపోటు నియంత్రణలో ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలోని వేలాది మందిని బీపీ సమస్య పీడిస్తుంది. అత్యధికంగా 1,02,968 మందికి రక్తపోటుతో బాధపడుతున్నట్లు తేలింది. పురుషుల్లోనే ఈ సమస్య అధికంగా ఉందని వైద్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. చాలామందికి రక్తపోటు నియంత్రణలో ఉండకపోవడంతో అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా గుండెపోటు, కిడ్నీ సమస్యలు వచ్చి ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బీపీ ఎక్కువగా ఉన్నప్పటికీ చాలా మందిలో ఎలాంటి లక్షణాలు కనిపించక ఒకే సారి ప్రాణమీదికి వచ్చే ప్రమాదముంది. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ అంటారు. అధిక రక్తపీడనం వల్ల గుండెపై భారాన్ని పెంచుతుంది. గుండెకు రక్తప్రసరణను తగ్గిస్తుంది. గుండె కండరాలను బలహీనపర్చి వైఫల్యానికి దారితీస్తుంది. మెదడులోని రక్తనాళాలు సున్నితత్వాన్ని కోల్పోయి, చిట్లిపోయి బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై పక్షవాతం బారిన పడే అవకాశం ఉంది. అధిక రక్తపోటు వల్ల మూత్ర పిండాలలో ఉన్న రక్తనాళాలు దెబ్బతిని, వాటి వైఫల్యానికి దారితీస్తుంది. రక్తపోటుపై ప్రజలకు అవగాహన కలిగించడానికి వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మే 17న 'ప్రపంచ హైపర్ టెన్షన్ డే'ను నిర్వహిస్తుంది.

లక్షణాలు

తీవ్రమైన తలనొప్పి, దృష్టి సమస్యలు, ముక్కు నుంచి రక్తం కారడం, అలసట, తల తిరగడం, ఛాతిలో బరువు, నొప్పిగా ఉండటం, అశాంతి, మాట తడబడటం, భయం, ఊరికే కోపం రావడం, చెమట పట్టడం లక్షణాలు రక్తపోటు రావడానికి ముందు కనిపిస్తాయి.

30 ఏళ్లు నిండిన ప్రతీ ఎనిమిది మందిలో..

బీపీ అనేది చాలా సాధారణంగా మారిపోయింది. కేవలం నగరాలు, పట్టణాలే కాకుండా పల్లెల్లోనూ ఈ సమస్య అనేక మందిని వెంటాడుతుంది. 30 ఏళ్లు దాటిన చాలు ప్రతీ పది మందిలో ఒకరికి బీపీ ఉంటున్న పరిస్థితి ఉందంటే ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. గ్రామాల్లో 26 శాతం, పట్టణాల్లో 30 శాతం బీపీ బాధితులున్నారని వైద్యశాఖ అంచనా వేసింది. జీవనశైలి కారణంగా తలెత్తే ఈ సమస్యలను నియంత్రించేందుకు ప్రభుత్వం కూడా చర్యలు తీసుకుంటుంది.

తీవ్ర ఒత్తిడితో..

కంప్యూటర్ సంబంధిత ఉద్యోగాలు చేసే వారితో పాటు, ప్రైవేట్ ఉద్యోగులు, నిరుద్యోగులు తీవ్ర ఒత్తిడికి లోనవుతుంటారు. అలాగే ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం తదితర కారణాల వల్ల రక్తపోటుకు గురవుతుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో యాభై ఏళ్ల పైబడిన వారు ఎక్కువగా బీపీతో బాధపడుతున్నట్లు తేలింది. వీరందరినీ గుర్తించిన వైద్యారోగ్యశాఖ ప్రతీనెల మందులు పంపిణీ చేస్తోంది.

పరీక్షలు చేయించుకోవాలి



కళ్లు తిరగడం, తల నొప్పి, అలసట, ముక్కు నుంచి రక్తం కారడం, ఛాతిలో బరువు తదితర లక్షణాలు ఉంటే వెంటనే టెస్టులు చేయించుకోవాలి. బీపీ ఉన్నట్లు తేలితే తగ్గించుకునేందుకు ప్రయత్నం చేయాలి. బీపీ ఉన్న వాళ్లు తప్పకుండా డాక్టర్ సలహా మేరకు మందులు వాడాలి. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ సమయానికి మందులు వేసుకోవాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా బీపీకి ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులకు ఎన్‌సీడీ కిట్ ద్వారా ప్రభుత్వం అన్ని రకాల మందులు అందిస్తోంది. క్రమం తప్పకుండా ఇవి వాడాలి.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి

టీజీఈజేఏసీ వికారాబాద్ జిల్లా

నూతన కమిటీ

వికారాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) వికారాబాద్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన వివిధ ఉద్యోగ సంఘాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. అన్ని సంఘాల సమన్వయంతో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా టీజీవో జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, అడిషనల్ జనరల్‌గా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. అదేవిధంగా కో చైర్మన్లు, వైస్ ప్రెసిడెంట్లు, జాయింట్ సెక్రటరీలు, ఇతర కార్యవర్గ సభ్యులుగా అన్ని ఉద్యోగ సంఘాలకు చెందిన ప్రతినిధులు ఎంపికయ్యారు. ఈ జేఏసీలో ఇప్పటికే దాదాపు 30 సంఘాలు భాగస్వామ్యం అయ్యాయి.

డీకే తండాలో విద్యార్థినులకు సన్మానం

ధారూరు, మే 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ డ్రాగన్ చాంపియన్ షిప్ పోటీల్లో, పెన్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన మండలంలోని డీకే తండాకు చెందిన స్రవంతి బాయి, దీపికలను తండావాసులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తండాకు చెందిన మాణిక్‌రావు, సంతోష్‌కుమారీల కూతురు స్రవంతిబాయి సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల వాటర్ స్పోర్ట్స్ ఆకాడమిలో చదువుతోంది. ఫిలిప్పిన్స్‌లో నిర్వహించిన డ్రాగన్ బోట్ పోటీల్లో మూడు (సిల్వర్, 2 కాంస్య) పతకాలు, మధ్యప్రదేశ్‌లో జరిగిన పోటీల్లో సిల్వర్, కాంస్య పతకాలు సాధించింది. అదే తండాకు చెందిన దీపిక తెలంగాణలోని మహబుబాబాద్‌లో నిర్వహించిన పెన్సింగ్(ఖడ్గం) పోటీల్లో బంగారు పతకం సాధించింది. వీరి ద్దరికి తండావాసులు శాలువాలు కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో తండావాసులు దేవుజ్యా నాయక్, బాల్‌రాజ్‌నాయక్, రాజునాయక్, బాబురావ్, రాములు నాయక్, మోహన్, బాల్‌రాజ్, బాస్కర్, తండావాసులు పాల్గొన్నారు.

డెంగీని అరికట్టడం అందరి బాధ్యత


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న వెంకటరవణ

వికారాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి): డెంగీని అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెంకటరవణ అన్నారు. ప్రతి సంత్సరం మే 16న డెంగీ నివారణ దినోత్సవం జరుపుకుటామని తెలిపారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించగా ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2030 నాటికి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఏళ్లుగా ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెరిగి, పారిశుధ్య కార్యక్రమాలు మెరుగుపడటంతో డెంగీ కేసులు గణనీయంగా తగ్గాయన్నారు. ఈ ఏడాది జిల్లాలో రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. ప్రజలు ఇంటి చుట్టూ నీరు నిల్వకుండా చూసుకోవాలని, పాత పాత్రలు, టైర్లు, ప్లాస్టిక్ వస్తువులు తొలగించాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, డ్రమ్ములకు మూతలు వేయాలని, ప్రతి శుక్రవారం నిల్వ నీటిని మార్చాలన్నారు. ఫాగింగ్, ఆయిల్ బాల్స్, గంబూషియా చేపల వలన దోమల పెరుగుదలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సృజన, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి మహేష్‌కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రకాశ్, జీజీహెచ్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమలను పారదోలుదాం.. ఆరోగ్యంగా ఉందాం

షాద్‌నగర్, మే 16 (ఆంధ్రజ్యోతి): దోమలను పారదోలి ఆరోగ్యంగా ఉండేందుకు ప్రజలంతా కృషి చేయాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి వద్ద జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగీ వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. దోమల నివారణకు ప్రజలంతా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుకోవాలని సూచించారు. మురుగు నీరు, చెత్త నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జర్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి

తూంకుంట 'డబుల్' ఇళ్ల పరిశీలన

శామీర్‌పేట, మే 16 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని అలంక్రిత రిసార్ట్స్ వెనుక రెండేళ్ల కిందట అప్పటి సీఎం కేసీఆర్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ అపార్ట్‌మెంట్‌ను తూంకుంట మున్సిపల్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, మున్సిపల్ డీఈఈ సునీత, ఆ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సందర్శించి పరిశీలించారు. ఆ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయా? అని మున్సిపల్ అధికారులు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఆ డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులకు అసరమైన విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరాపట్ల మున్సిపల్ అధికారులు పర్యవేక్షించారు. ఎలాంటి ఇబ్బందులున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని కమిషనర్ వెంకట గోపాల్ లబ్ధిదారులకు భరోసా ఇచ్చారు. ఇదిలా ఉండగా, ఏడాదిన్నర కిందట గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆగమేఘాల మీద ఈ అపార్ట్‌మెంట్‌ను ప్రారంభించగా 50శాతం కూడా మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతో చాలా మంది లబ్ధిదారులు అరకొర వసతుల కారణంగా ఇళ్లలో ఉండలేక అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ విషయమై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిసారించి తగుచర్యలు చేపట్టింది. లబ్ధిదారులకు అవసరమైన మౌలిక సదుపాయాల పట్ల స్థానిక మున్సిపల్ అధికారులు చొరవతీసుకుని దాదాపు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆ డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్ల ఇళ్లలోకి గత ఆరునెలల నుంచి ఇప్పటి వరకు దాదాపు 456లబ్ధిదారుల కుటుంబాలు గృహప్రవేశం చేసి నివాసముంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఎప్పటికప్పుడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పర్యవేక్షించడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


లబ్ధిదారులను అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్


అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటున్న తిరుపతిరెడ్డి

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

కొడంగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం నారాయణపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నందారం ప్రశాంత్, రఘువర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేశ్యనాయక్, అధికారులు జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.


డీటీ మధుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

షాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇప్పటి వరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రం లేదని, రైతులు దళారుల చేతిలో మోసపోయి నష్టపోతున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ మండలాధ్యక్షుడు దండు యాదవరెడ్డి అన్నారు. ఈమేరకు శుక్రవారం షాబాద్‌లో డిప్యూటీ తహసీల్దార్ మధుకు రైతులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ సీజన్‌లో వరి కొనుగోలు కేంద్రం లేకపోవడంతో రైతులు ప్రైవేట్ మార్కెట్‌లో రూ. 1500 నుండి రూ. 1800 అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారు. కావున వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి సత్యానారాయణరెడ్డి, సంఘం సభ్యులు వెంకట్‌రెడ్డి, ఒగ్గు మల్లయ్య, చంద్రయ్య, నర్సింహులు, సత్యంగౌడ్, రైతులు చంద్రకళ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అన్నిరంగాల్లో రాణించాలి

చౌదరిగూడ, మే 16(ఆంధ్రజ్యోతి): బీసీ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని జిల్లేడ్ చౌదరిగూడ బీసీసేన మండలాధ్యక్షురాలు ప్యాట జయ అన్నారు. శుక్రవారం ముష్టిపల్లిలో బీసీసేన మహిళ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముష్టిపల్లి అధ్యక్షురాలిగా శంకురిగారి నర్సమ్మ, ఉపాధ్యక్షురాలిగా కన్న అరుణమ్మ, ప్రధాన కార్యదర్శిగా పుష్పమ్మలతోపాటు మరికొంతమందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ బీసీ మహిళాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, బాల్‌రాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

- పాతబండ్లకు రంగులేసి, నంబర్లు మార్చి దందా
- నామమాత్రంగా విచారణ చేపట్టిన పోలీసులు
- న్యాయస్థానాన్నే తప్పుదోవపట్టించారా?
- పరిగిలో చర్చనీయాంశంగా వాహన నంబర్ల ట్యాంపరింగ్ వ్యవహారం

ఆది నుంచీ అనుమానాలే?!

పరిగి, 16 (ఆంధ్రజ్యోతి): అంగబలం, అర్థబలం, అధికారం తోడైతే ఏమైనా చేయవచ్చని కొందరు దోపిడీ దందాకు తెరలేపినట్లు తెలుస్తోంది. పరిగిలో బోరుబండ్ల నంబర్ల ట్యాంపరింగ్ వ్యవహారం ఆది నుంచీ పలు అనుమానాలకు తావిస్తోంది. విదేశాలకు అక్రమంగా తరలుతున్న బోరుడ్రిల్లింగ్ వాహనాలను పోలీసులు సీజ్ చేయడం వరకు బాగానే ఉన్నా, సీజింగ్ అనంతరం ఆ వాహనాన్ని ఆర్టీసీ డిపోలో ఉంచడం, పూర్తిస్థాయి విచారణ చేపట్టకపోవడం చర్చనీయాశంగా మారింది. పోలీసులు, ఆర్టీసీ అధికారుల తీరు విచిత్రంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈకేసును నామమాత్రంగా విచారణ చేసి వదిలేయడంపై ప్రజల్లో పోలీసుల పట్ల విమర్శలు వస్తున్నాయి.

న్యాయస్థానాన్నే తప్పుదోవపట్టించారా?

గత అక్టోబరులో అక్రమంగా తరలిస్తూ సీజైన బోరుబండిని విడిపించేందుకు యజమాని ఏకంగా న్యాయస్థానాన్నే తప్పుదోవపట్టించినట్లు సమాచారం. పరిగి డిపోలో ఉంచి సదరు వాహనాలకు సంబంధించి చాసిస్, ఇంజన్ నంబర్లను గ్రాండింగ్ చేసి వారికి కావాల్సిన నంబర్లను మోల్డింగ్ చేసి, కొత్త నంబర్లతో రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను సృష్టించినట్లు తెలుస్తోంది. వాటి ఆధారంగానే కోర్టును ఆశ్రయించి బోరుబండి రిలీజింగ్ ఆర్డర్‌ను పొందినట్లు తెలిసింది. సదరు ఆర్డర్ కాపీని పోలీసులకు అందజేసి బండిని రిలీజ్ చేయాలని కోరినట్లు సమాచారం. అయితే అప్పటికే ఆర్టీసీడిపోలో ఉన్న బండికి నంబర్ల ట్యాంపరింగ్ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. బండి యజమానిపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. నంబర్ల ట్యాంపరింగ్ వ్యవహారం బయటకు రాకుండా పోలీసులు, ఆర్టీసీ అధికారులు జాగ్రత్త పడినట్లు తెలిసింది. బోరు బండిని సీజ్‌చేసి ఆర్టీసీ డిపోలో పెట్టామని పోలీసులు చెబుతుంటే, తమకు ఎలాంటి సీజింగ్ లెటర్ ఇవ్వకుండా పెట్టారని ఆర్టీసి అధికారులు చెబుతుండడం గమనార్హం.



గతంలో పట్టుపడిన బోరు బండి(ఫైల్)

పాత బండ్లకు రంగులేసి.. నంబర్లు మార్చి..

బోరు డ్రిల్లింగ్ వాహనాల తరలింపులో కొందరు పెద్ద మొత్తంలో అక్రమంగా సంపాదిస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కాలం చెల్లిన, పాతబడిన వాహనాలకు రంగులు వేసి కొత్త వాహనాలుగా ముస్తాబు చేస్తున్నారు. అదేవిధంగా విడి భాగాలను వేర్వేరు చోట్ల కొనుగోలు చేసి అసెంబ్లీ ఫిట్టింగ్‌తో బోరుడ్రిల్లింగ్ వాహనాలను కొత్తవిగా తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇలా తయారు చేసిన వాహనం రూ.60లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ఖర్చవుతుందని చెబుతున్నారు. ఇదే తయారీ కంపెనీ నుంచి రావాలంటే రూ.2కోట్ల వరకు ఖర్చవుతుందంటున్నారు. ఇలా తక్కువ ఖర్చుతో తయారు చేసిన వాహనాలను విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలుస్తోంది. పటాన్‌చెరు, నల్గొండ, పాలమూరు జిల్లాలకు చెందిన కొందరు ముఠాగా ఏర్పడి ఈదందా నడిపిస్తున్నట్లు సమాచారం.

పేరుమోసిన కంపెనీ పేరుతో ఫేక్ ముద్రలు

పటాన్‌చెరులోని ఓ పేరుమోసిన కంపెనీలో ఛాసిస్, ఇంజన్ నెంబర్లతో పాటు ప్రొడక్షన్ కంపెనీల పేరుతో ఫేక్ ముద్రలు వేయిస్తున్నట్లు తెలిసింది. అక్కడి నుంచి నగరంలోని వనస్థలిపురంలోని పాత వాహనాలు, విడి భాగాలకు రంగులు వేస్తారు. అదేవిధంగా మరికొన్ని అసెంబ్లీ ఫిట్టింగ్‌తో బోరు డ్రిల్లింగ్ వాహనాలను తయారు చేస్తున్నట్లు తెలిసింది. ఇలా తయారు చేసిన వాహనాలను షాద్‌నగర్ పరిగి మీదుగా ముంబై పోర్టుకు తరలించి, అక్కడి నుంచి ఆఫ్రికాలోని జాంబియా, ఉగాండా, తదితర దేశాలకు తరలిస్తున్నట్లు సమాచారం.

క్రైం కార్నర్

క్రిప్టోకరెన్సీ పేరుతో భారీ మోసం

- మహిళకు రూ.కోటి కుచ్చుటోపీ

ఘట్‌కేసర్ రూరల్, మే 16(ఆంధ్రజ్యోతి): క్రిప్టోకరెన్సీ పేరుతో ఓ గృహిణికి రూ.కోటి కుచ్చుటోపీ పెట్టిన ముగ్గురిపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన ఓగృహిణి(56) 2020లో తన కుమారుడు లాలానరేష్ ద్వారా నగరానికి చెందిన మణికొండ రమ్య, మణికొండ దివ్య, జోగులు సుధీర్‌కుమార్‌తో పరిచయం ఏర్పడింది. కొద్ది రోజులకు దివ్య తల్లి మణి, సుధీర్‌కుమార్ తండ్రి జ్ఞానేశ్వర్‌లు పరిచమమయ్యారు. 2021లో రమ్య, దివ్యలు కలిసి లాలానరేష్ తల్లి(గృహిణి)ని సంప్రదించి తమ తండ్రి చనిపోయాడని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని రూ.50లక్షలు అప్పు కావాలని అడిగారు. అందుకు ఆమె తనకు చేగుంటలో ఉన్న వ్యవసాయ భూమిని తనఖా పెట్టి రూ.50లక్షలను మణికొండ రమ్య, దివ్య బ్యాంక్‌ఖాతాలో ట్రాన్స్‌ఫర్ చేసింది. మొదటి ఆరునెలలు డబ్బులు సక్రమంగా పంపించారు. తర్వాత ఏసీఏఎస్‌వో గ్లోబల్ సర్వీసెస్ ద్వారా ఫారెక్స్ ట్రేడింగ్, ఆన్‌లైన్ ట్రేడింగ్, క్రిప్టోకరెన్సీలో పెట్టుబడి పెట్టామని అందులో అధిక లాభాలు వస్తాయని నరేష్ తల్లిని నమ్మించారు. దీంతో ఆమె ద్వారా రూ.కోటీ 66లక్షల 48వేల 118లను రమ్య, దివ్య, సుధీర్‌కుమార్ బ్యాంక్‌ఖాతాలోకి బదిలీ చేయించుకున్నారు. ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టారు. ఈ లావాదేవీల్లో నరేష్ తల్లికి రూ.కోటీ 15లక్షల 30వేలు మాత్రమే వచ్చింది. అయినప్పటికీ ఆమెకు రావాల్సిన మొత్తాన్ని ఇవ్వలేదని బాధితురాలు వాపోయింది. కొద్దిరోజుల నుంచి ఫోన్ తీయకపోవడంతో తనను నమ్మించి మోసం చేశారని భావించిన నరేష్ తల్లి రమ్య, దివ్య, సుధీర్‌కుమార్‌లపై పోచారం పోలీసులను ఆశ్రయించింది. తనకు రావాల్సిన మొత్తం రూ.కోటీ 1లక్షా 18వేల 118 వరకు ఇవ్వలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజు వర్మ తెలిపారు.

గట్టుమైసమ్మ ఆలయంలో చోరీ

- నాలుగు హుండీల్లో రూ.30వేల నగదును అపహరణ


చెట్ల పొదల్లో హుండీలు

ఘట్‌కేసర్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో నాలుగు హుండీలను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రైంసీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం. ఘట్‌కేసర్‌లోని గట్టు మైసమ్మ ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి నాలుగు హుండీలను ఎత్తుకెళ్లారు. ఆలయ సమీపంలో హుండీలకున్న తాళాలను పగులగొట్టి అందులోని నగదును అపహరించుకెళ్లారు. ఉదయం వాచ్‌మెన్ ఆలయ ఈవో భాగ్యలక్ష్మికి సమాచారం ఇవ్వడంతో చోరీ విషయాన్ని ఆమె పోలీసులకు తెలిపింది. దీంతో ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాలను పరిశీలించి క్లూస్‌టీంను రప్పించి ఆధారాలను సేకరించారు. నాలుగు హుండీల్లో రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఆలయ ఈవో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు క్రైం సీఐ తెలిపారు.

బోధనా సిబ్బంది అంకితభావం వల్లే అద్భుత ఫలితాలు



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ప్రిన్సిపల్ శ్రీలత

కీసర రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): బోధనా సిబ్బంది అంకితభావం వల్లే అద్భుతమైన ఫలితాలను సాధించామని పల్లవి స్కూల్ ప్రిన్సిపల్ శ్రీలత చన్నప్రగడ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధి అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా శుక్రవారం విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందించారు. బి.ఈశ్వర్‌సాయి, వైఎస్ఎల్ మేఘనలు 95శాతం మార్కులతో మొదటి స్థానంలో, డి.సాయి, స్వరూప, సుయేష్‌మల్హారి హబ్ 94శాతంతో ద్వితీయ స్థానంలో, ఎస్.సువర్షిత, ఇషికలు 92శాతంలో తృతీయ స్థానంలో మార్కులు సాధించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వైష్ణవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం


ఎన్నికైన లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గం

కొడంగల్, మే 16 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక కేఎస్‌వీ ఫంక్షన్ హాలులో ఎన్నుకున్నారు. లయన్స్‌క్లబ్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ గురునాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో కొడంగల్ లయన్స్ అధ్యక్షుడిగా మురారి వశిష్ఠ, సెక్రటరీగా భీమరాజు, ట్రెజరర్‌గా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కేవీ.రాజేందర్, దామోదర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా రమేశ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా ముద్దప్పదేశ్‌ముఖ్, పీఆర్‌వోగా శ్రీకిషన్‌రావును ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ దాసప్పయాదవ్, శ్రీనివాస్‌గుప్త, వెంకట్‌రెడ్డి, భాస్కర్, శివకుమార్‌గుప్త పాల్గొన్నారు.

తరిగోపులలో బోర్ డ్రిల్లింగ్

ధారూరు, మే 16(ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ మండలంలోని తరిగోపుల గ్రామంలోని ఎస్సీ కాలనీలో బోర్ డ్రిల్లింగ్ చేయించారు. ఈ మేరకు శుక్రవారం ఎస్సీ కాలనీలో బోర్ డ్రిల్లింగ్ పనులను యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోలుకుంద సంతోష్‌కుమార్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గఫార్, శ్రీనివాస్ రెడ్డి, వన్నెయ్య పాల్గొన్నారు.

బషీరాబాద్ హౌసింగ్ ఏఈగా అన్సార్



బషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి) మండల హౌసింగ్(గృహ నిర్మాణ శాఖ) ఏఈగా ఎండీ. షేక్ హుస్సేన్ అన్సార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎంపీడీవో శెట్టి రవికుమార్‌ను శుక్రవారం కార్యాలయంలో ఆయన కలిశారు. అనంతరం కాశీంపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఏఈ పరిశీలించారు. లబ్దిదారులకు పలు సూచనలు చేశారు.

బషీరాబాద్ తహసీల్దార్ బదిలీ

బషీరాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి) బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేశ్ బదిలీ అయ్యారు. ఎన్నికల సమయంలో బదిలీపై ఇక్కడికి వచ్చిన ఆయనను తిరిగి సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. ఈ మేరకు భూపరిపాలన ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా బదిలీపై వెళ్లనున్న తహసీల్దార్ నేడో, రేపో ఇక్కడి నుంచి రిలీవ్ కానున్నారు. పూర్వపు జిల్లా వికారాబాద్‌కు 6గురు తహసీల్దార్లు రాగా, అందులో ఒకరిని ఇక్కడ నియమించనున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి


ప్రయాణికులకు పూలను అందజేస్తున్న డీఎం కవిత

ఘట్‌కేసర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందిచేందుకు ఆర్టీసీ నిరంతరం కృషి చేస్తోందని చెంగిచెర్ల ఆర్టీసీ డీఎం కవిత అన్నారు. ఆర్టీసీ మర్యాద దినోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఘట్‌కేసర్‌లోని ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ధాన్యం.. దైన్యం

(ఐదో పేజీ తరువాయి)

2 నుంచి 3 కిలోలు, ఇలా క్వింటాలుకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతు తూకం చేసిన ధాన్యానికి మిల్లులో రాసుకుంటున్న లెక్కలకు పొంతన ఉండడం లేదు. తరుగు పేరుతో మిల్లర్లు రూ.లక్షలు గడిస్తున్నారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు సేకరించన దాంట్లో నుంచి వేల క్వింటాళ్లలో ధాన్యాన్ని దొడ్డిదారిన మెక్కేశారని, ఆ ధాన్యం విలువ రూ.కోట్లలో ఉంటుందని అంచనా. అధికారుల అండదండలతో ఇంకా 75 శాతం ధాన్యం సేకరించాల్సి ఉంది. మిల్లర్లు పెద్ద మొత్తంలో అధికారుల సహకారంతో దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

లారీలు రాక కేంద్రాల్లోనే ధాన్యం నిల్వలు..

జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో సేకరించిన ధాన్యం నిల్వలను రైస్‌మిల్లులకు తరలించేందుకు లారీలు పెద్ద సమస్యగా మారింది. జిల్లాలో ధాన్యం రవాణ కోసం తీసుకున్న గుత్తేదారు లారీలను సకాలంలో లారీలను సమకూర్చడం లేదు. దీంతో కేంద్రాల్లోనే వరిధాన్యం బస్తాలు పేరుకపోతున్నాయి, దీంతో వర్షం కురిస్తే తడిసిపోతున్నామని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం తీసుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. నాలుగు నెలలపాటు ధాన్యంను పండించింది ఒక్క ఎత్తయితే అమ్ముకోవడం పెద్ద సమస్యగా మారిందని వాపోతున్నారు.

> **కేంద్రాలు ప్రారంభించాం**
>
> జిల్లాలో 128 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాం. అన్ని కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రారంభమైంది. ఇక ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. అన్ని కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తాం. ఇప్పటి వరకు రెండు లక్షల క్వింటాళ్లా ధాన్యం సేకరించాం. రైతుల ఖాతాల్లో రూ.25 కోట్లు జమ చేశాం.
>
> - మోహన్‌కృష్ణ డీఎం, సివిల్ సప్లయి, వికారాబాద్

కేంద్రాల్లో వసతులు లేక అవస్థలు

జిల్లాలో 128 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా అందులో కనీస వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు నిల్వ చేయడానికి వీలుగా గోదాములు ఉండాలి. అయితే జిల్లాలో ఎక్కడ కూడా ఈ వసతి లేదు. కొనుగోలు కేంద్రాల్లో తూకం మిషన్‌లు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, తేమ మీటర్స్ ప్యాడీ క్లీనర్లు, లైటింగ్ తదితర సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. వీటిని కొనుగోళ్లకు ఒక నెల ముందుగా ఏర్పాటు చేయాలి. అయితే జిల్లాలో 29 లక్షల గన్నీ బ్యాగులు అవసరం ఉండగా ప్రస్తుతం 15 లక్షల గన్నీ బ్యాగులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో అన్నదాతులు కొనుగోలు కేంద్రాల వద్ద పడరాని పాట్లు పడుతున్నారు.


కొడంగల్ కేంద్రంలో వరిధాన్యం బస్తాలు

> **25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం**
>
> **వికారాబాద్:** జిల్లాలో ఇప్పటివరకు 25 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లు, సన్నబియ్యం పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల కమిషన్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఏర్పాటు చేసిన 128 కొనుగోలు కేంద్రాల్లో 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు తెలిపారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలతో పాటు కావాల్సిన తాడిపత్రిలు, సంచులు, తేమ యంత్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కొనుగోలు ధాన్యానికి సంబంధించి నిర్ధిష్టమైన సమయంలో రైతులకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఆర్డీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.
>
> 
> సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

ఘనంగా ఎమ్మెల్యే యాదయ్య జన్మదిన వేడుకలు


నవాబుపేట: చింతల్‌పేట్‌లో ఎమ్మెల్యే జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు


నవాబుపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవాబుపేట, మే 16 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదిన వేడుకలను శుక్రవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. నవాబుపేట మండల కేంద్రంలో శుక్రవారం కేక్ కట్ చేసి ఎమ్మెల్యే కాలే యాదయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే స్వగ్రామంలో కాలే యాదయ్య జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలే యాదయ్య ఇలాంటి జన్మదిన వేడుకలను మరెన్నో జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీతా సింగ్, రామ్‌రెడ్డి, చిట్టెపు మల్లారెడ్డి, తలారి ప్రభాకర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే యాదయ్యకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

వికారాబాద్, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): చేవెళ్ల హ్యాట్రిక్ ఎమ్మెల్యే కాలే యాదయ్య జన్మదిన సందర్భంగా హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాదయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాదారం.. ఇక పారిశ్రామిక కేంద్రం

(ఐదో పేజీ తరువాయి)

రైతులకు పరిహారం అందించడంతోపాటు ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అవసరమైన పనులన్నీ ప్రభుత్వం వేగంగా పూర్తి చేసింది. వందలాది పరిశ్రమలతోపాటు వేలాది మందికి ప్రత్యేకంగా, లక్షలాది మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విస్తరణకు వేగవంతంగా చర్యలు చేపడుతున్నది. గ్రిడ్ పాలసీలో భాగంగా హైదరాబాద్ నగరానికి తూర్పు దిశగా ఉన్న ఘట్‌కేసర్ మండలం మాదారంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రభుత్వం సేకరించిన భూమిని వివిధ పారిశ్రామికవేత్తలకు కేటాయించి టీఎస్ ఐపాస్ ద్వారా అన్ని అనుమతులు ఇప్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోంటోంది.

నగరశివారు మేడ్చల్ జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు పారిశ్రామిక వేత్తలు ఉత్సాహంగా ఆసక్తి కనబరుస్తున్నారు. అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ఉండటంతో పారిశ్రామిక అధిపతులు కొత్త పరిశ్రమలను నెలకొల్పేందుకు టీఎస్ఎస్ ఐపాస్ ద్వారా అనుమతులు పొందడానికి ముందుకువస్తున్నారు. జిల్లాలో కొత్తగా 783 భారీ, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను రూ. 12,523 కోట్ల పెట్టుబడులతో నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలు ముందుకు వస్తున్నట్లు సమాచారం. కొత్త పరిశ్రమల ఏర్పాటుతో 46,356 మంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు లభించనున్నట్లు పరిశ్రమల శాఖ అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

తాండూరు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారిగా ఆర్కే రవి



తాండూరు రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి) : తాండూరు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారిగా రసకపురం రవి ఇటీవల బాధ్యతలు చేపట్టారు. తాండూరు అటవీ శాఖ రేంజ్‌లో పనిచేస్తున్న నాగజ్యోతి మహబూబ్‌నగర్ జిల్లా ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రసకపురం రవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ రేంజ్ అధికారి రవి మాట్లాడుతూ అటవీ శాఖ పరిధిలో అక్రమ కలప రవాణా కాకుండా తగు చర్యలు చేపడతామన్నారు. తాండూరు రేజ్ పరిధిలోని గొట్లపల్లి, జినుగుర్తి, అంతారం తదితర ప్రాంతాల్లో అటవిని పరిరక్షించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్, మే 16 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ మండలంలో 132 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పర్సాపూర్, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, పాత కొడంగల్ గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

తాండూరురూరల్: నేడు(శనివారం) తాండూరు మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తాండూరు విద్యుత్ శాఖ డీఈ భానుప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జినుగుర్తి, కోటబాస్పల్లి, కరన్‌కోట్, గౌతాపూర్ 33/11కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నంబరు ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

బషీరాబాద్, మే16(ఆంధ్రజ్యోతి): నంబరు ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ శంకర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన నేతృత్వంలో పోలీసులు నంబరు ప్లేట్లు లేని వాహనాల కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా 10 ద్విచక్ర వాహనాలను తనిఖీల్లో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇళ్లకు వెళ్లి నంబర్ ప్లేటు తెచ్చుకుని బిగించుకున్నాకే వాహనాలను వదిలిపెట్టారు.

నేడు ప్రమాణ స్వీకారం

శామీర్‌పేట : శామీర్‌పేటలోని బృందావన్ ఇన్ హోటల్‌లో శనివారం(నేడు) నాడు ఉదయం 10 గంటలకు రాష్ట్ర మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు బత్తుల జీవన్‌ప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బొడ్రాయి పునఃప్రతిష్ఠ పూజలు ప్రారంభం

ఘట్‌కేసర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో శుక్రవారం బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం ప్రారంభమైన పూజలు ఆదివారం బోనాల సమర్పణతో ముగియనున్నాయి. నేడు బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కూలీలందరికీ పనులు కల్పించాలి

దోమ, మే 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీలో పని అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించాలని ఎంపీడీవో గ్యమా అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా నిలుస్తా

పరిగి, 16 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులకు అండగా నిలుస్తానని కేఎస్ఆర్ ట్రస్టు చైర్మన్ కె.శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. సుల్తాన్‌పూర్ గ్రామంలోని న్యూబ్రిల్లియంట్ హైస్కూల్‌లో కొనసాగుతున్న సమ్మర్ క్యాంపులో క్రీడాకారులతో కలిసి మాట్లాడి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపు ఇన్‌చార్జి శ్రీనివాస్‌నాయక్, రమేశ్‌నాయక్, శ్రవణ్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి



పరిగిలో డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ

పరిగి/దౌల్తాబాద్/కులకచర్ల/దోమ, 16 (ఆంధ్రజ్యోతి): డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల్ వైద్యాధికారి విద్యాప్రియ, మలేరియా అధికారి వెంకన్న పాల్గొన్నారు. అదేవిధంగా దౌల్తాబాద్‌లో వైద్యురాలు అమూల్య వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు సౌమ్య, సిబ్బంది రఫీ, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. కులకచర్లలో వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ స్థానిక వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు మాధురి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అదేవిధంగా దోమలో వైద్యురాలు రజిత శుక్రవారం మండల కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు.

వివాహ వేడుకలో ప్రభుత్వ చీఫ్‌విప్


వధూవరులను ఆశీర్వదిస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి

యాలాల, మే 16, (ఆంధ్రజ్యోతి): యాలాల మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ కుమారుడు శ్రవణ్, సారిక వివాహం శుక్రవారం సదాశివ్‌పేట్‌లో జరిగింది. ఈ వివాహానికి ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట టీపీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తంరావు ఉన్నారు.

ప్రతీ తండాకు రోడ్డు సౌకర్యం

దుద్యాల, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రతీతండాకు రోడ్డు సౌకర్యం కల్పించి, అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ ఆకారం వేణుగోపాల్ అన్నారు. మండలంలోని పులిచర్ల కుంట తండాకు మంజూరైన రూ.84లక్షలతో శుక్రవారం సీసీరోడ్డు పనులను కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, నాయకులు సీతారాంనాయక్, యుగంధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, నర్సింహులు యాదవ్, కృష్ణ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

చౌడాపూర్, మే 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు అండగా నిలుస్తోందని మాజీ సర్పంచ్ రాములమ్మ శేఖర్ అన్నారు. మండలంలోని చాకల్‌పల్లికి చెందిన చెంచు మంగమ్మకు ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.17,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోన్యనాయక్, తిరుమల రాములు, కేశవులు, విజయ్, బాల్‌రాజ్, అనిల్ పాల్గొన్నారు.

కులకచర్ల నూతన ఎస్ఐగా రమేశ్



కులకచర్ల, మే 16 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల నూతన ఎస్ఐగా రమేశ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎస్పీ కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన అన్వేష్‌రెడ్డి ఎస్పీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని నూతన ఎస్ఐ రమేశ్ తెలిపారు.